## నేడు జవహర్ నగర్‌లో ఘనంగా 140వ మేడే ఉత్సవాలు

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని, మే 1వ తేదీ శుక్రవారం జవహర్ నగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 140వ మేడే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారని జవహర్ నగర్ భవనిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్ తెలిపారు. ఉదయం 8:00 గంటలకు స్థానిక విఆర్‌వో ఆఫీస్ ఎదురుగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, ప్రముఖ ప్రజా నాయకులు, కళాకారులు ప్రభుత్వ న్యాయవాదులు పాల్గొంటారని. జెండా ఆవిష్కరణ అనంతరం కార్మికుల హక్కుల కోసం భారీ సభ మెయిన్ రోడ్డుపై ర్యాలీ నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ప్రధానంగా ఈ క్రింది డిమాండ్లపై చర్చించనున్నారు. 1. లేబర్ అడ్డా స్థలం: కార్మికులు వేచి ఉండటానికి శాశ్వత అడ్డా స్థలం కేటాయింపు. 2. కూలీ రేట్లు: ప్రస్తుత ధరలకు అనుగుణంగా భవన నిర్మాణ కార్మికుల కూలీ రేట్ల సవరణ, 3.కార్మిక హక్కులు: ప్రభుత్వం నుండి అందాల్సిన సంక్షేమ పథకాలు భద్రతపై అవగాహన కార్మికులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాలి. రేపు జరిగే ఈ మేడే వేడుకలకు, ర్యాలీకి భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని, భవన నిర్మాణ కార్మిక సంఘం జవహర్ నగర్ ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్ ఒక ప్రకటనలోతెలిపారు.



## పెండింగ్ పనులు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** పెండింగ్‌లో ఉన్న పనులకు త్వరితగతిన పూర్తి చేయాలని ఘట్కేసర్ సర్కిల్ డిసి వాణికి వినతి పత్రం సమర్పించారు.గురువారం ఘట్కేసర్ సర్కిల్ కార్యాలయంలో డిసిని నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వంగా కలసి డివిజన్‌లో ఆన్ ప్రొగ్రెస్‌లో ఉన్న 25 కోట్ల రూపాయల పనులను త్వరితగతి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి,సురేస్,ప్రవీణ్,వేణుగోపాల్‌రావు తదితరు లు పాల్గొన్నారు.



## ఐజికె కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజికె కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా నివసిస్తున్న కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు పైకప్పులు లీకేజీ , డ్రైనేజీ, భవనాల స్లాబు పెచ్చులు ఊడిపోవడం జరుగుతుందని కాలనీవాసులు తెలుపడంతో ఎమ్మెల్యే గత కొన్ని రోజుల క్రితం అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.సమస్యలు దృష్టిలో పెట్లుకుని అధికారులతో ఎమ్మెల్యే కాలనీలో పర్యటించి సమస్యలు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



## ఐమాస్ లైట్లకు, బోర్‌వెల్‌కు మార్కింగ్

**ప్రజాపక్షం/దుండిగల్ :** బౌరంపేట్ డివిజన్ సింహపురి కాలనీ సమస్యల పై కాలనీ వాసులు సర్కిల్ బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి పర్యటించారు. గత నెల కాలనీ వాసులతో కలిసి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేసిన వెంటనే, ప్రధాన సమస్య అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఐమాస్ లైట్లు మరియు బోర్‌వెల్ మంజూరు కు ఆదేశించారు ఈ సందర్భంగా ఎంపి లాడ్స్ నిధులతో 2 ఐ మాస్ పోల్స్, ఒక బోర్‌వెల్ కు కాలనీ వాసులతో కలిసి మార్కింగ్ చేశారు. కాలనీకి కొత్త వెలుగులు ప్రసాదించినందుకు ఎంపి ఈటల రాజేందర్ కు బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు కాలనీ లోని ఓపెన్ టు స్పెస్, పార్క్ స్థలాల అక్రమ కబ్జాలు అధికారులు తొలగించడంతో ఆ యొక్క స్థలాలను సందర్శించి వాటికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి అధికారుల ఆధీనంలో తీసుకోని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోశాధికారి కొమ్ము ప్రశాంత్ స్థానిక వాసులు నల్ల రాజిరెడ్డి, పరికి ప్రమోద్ కుమార్, సాయి కిరణ్, శివ, నరేందర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ జ్యుడీషియల్ సర్వీస్ ఏర్పాటు పిటిషన్‌పై...

## కేంద్రం, లా కమిషన్, ఇతరులకు 'సుప్రీం' నోటీసులు

**న్యూఢిల్లీ :** రెవెన్యూ జ్యుడీషియల్ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలని, భూ వివాదాలను పరిష్కరించే ప్రభుత్వ ఉద్యోగులకు కనీస న్యాయ అర్హత, శిక్షణా విధానాన్ని నిర్దేశించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం(పిల్)పై గురువారం సుప్రీంకోర్టు కేంద్రం, ఇతరుల నుంచి స్పందన కోరింది. భూ వివాదాలను అర్హతలేని న్యాయ నిపుణలు పరిష్కరిస్తున్నారని ఆరోపిస్తూ న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, లా కమిషన్, ఇతరులకు నోటీసులు జారీచేసింది. దాదాపు 66శాతం సివిల్ కేసులు భూవివాదాలకు సంబంధించినవేనని, అధికారిక న్యాయవిద్య, శిక్షణలేని అధికారులు ఈ కేసుల్ని విచారిస్తున్నందువల్ల తప్పుడు, అస్థిరమైన తీర్పులు వెలువడటమే ఇక్కడి ప్రధాన లోపమని పిటిషనర్ పేర్కొన్నారు. న్యాయవాది అశ్వినీ దూబే రూపొందించిన పిటిషన్‌లో ఈ అంశాన్ని అలహాబాద్ హైకోర్టు పరిష్కరించినప్పటికీ దాని ఆదేశం ఇప్పటివరకూ అక్షరాలా అమలుకు నోచుకోలేదని పిటిషనర్ తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థ భూవివాదాల పరిష్కారాన్ని న్యాయ నేపథ్యంలేని రెవెన్యూ అధికారులకు అప్పగించడం ద్వారా పౌరులకు నిరంతర నష్టాన్ని కలిగిస్తోందని, దీని ఫలితంగా ఏకపక్ష, అస్థిరమైన, దోషపూరిత నిర్ణయాలు వెలువడుతున్నాయని, దీనివల్ల ఆస్తి హక్కులపై దీర్ఘకాలిక అనిశ్చితి ఏర్పడి, భూవినియోగం బదిలీపై ఆంక్షలు విధించబడి, వ్యాజ్యాలు, ఖర్చులు పెరిగి, న్యాయం పొందేందుకు సమర్థవంతమైన అవకాశం లేకుండా పోతోందని, తద్వారా రాజ్యాంగంలోని 14, 21 ఆర్టికల్స్ కింద హామీ ఇవ్వబడిన ప్రాథమిక హక్కులను ఇది ఉల్లంఘిస్తున్నదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## పిల్లల చట్టబద్ధ దత్తత కోసం 'హెల్ప్‌డెస్క్'

కలెక్టర్ మనుచౌదరి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** పిల్లలను అధికారికంగా దత్తత తీసుకొనే ప్రక్రియ సంబంధించి జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేస్తున్న అడాప్షన్ హెల్ప్ సెంటర్ ద్వారా అవసరమైన సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. చట్ట ప్రకారమే దత్తతలు తీసుకోవాల్సి ఉంటుందని, అక్రమ దత్తతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాయమన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆయన గురువారం హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ఇకపై ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి రోజున దత్తత విషయమై అధికారులు, సిబ్బంది సాయం చేస్తారన్నారు. దత్తతలో అంతర్జాతీయ దత్తత, విదేశీ దత్తత, బంధువుల నుండి తీసుకొనే దత్తతలాంటి పలు రకాలు ఉన్నాయన్నారు. ఈ విషయంలో దత్తత తీసుకొనే దంపతులు నిబంధన నియమాలు తెలుసుకోవాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ ఆస్పత్రుల్లో కానీ నర్సింగ్ హోమ్స్‌లలో కానీ దత్తత తీసుకోవటం నిబంధనలకు వ్యతిరేకమన్నారు. దత్తత ప్రక్రియ కోసం www.missionvastalya.wvd.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియజ్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు శిక్షణలో భాగంగా స్పాన్సర్‌షిప్, పిల్లల దత్తత అంశాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. అక్రమంగా దత్తత తీసుకొంటే అట్టి సమాచారాన్ని 1098 ద్వారా సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. పోస్టర్ కేర్ ప్రతి ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి కుటుంబాలతో మాట్లాడి దత్తతపై ఉన్న అపోహలు తొలగిస్తూ చట్టబద్దంగా దత్తత తీసుకొనేందుకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా అనాథ పిల్లల సంరక్షణ దత్తత ప్రక్రియ అవగాహన కోసం జిల్లా ఆరోగ్య విభాగం కీలక చర్యలు తీసుకోవాలన్నారు.







**డీజిల్, పెట్రోల్ కొరత లేదు-భయాందోళనలు వద్దు**

జిల్లాలో ఎలాంటి డీజిల్, పెట్రోల్ కొరత లేదని, ఈ విషయంలో వస్తున్న సోషల్ మీడియా దుష్ప్రచారాలను చూసి వాహనదారులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. గురువారం ఆయన శామీర్‌పేట మండలంలోని తూంకుంట ప్రాంతంలో ఉన్న పెట్రోల్ పంపును తనిఖీ చేసారు. నిర్వాహకుల రికార్డులను పరిశీలిస్తూ ఏ మేరకు స్టాక్ అందుబాటులో ఉందన్న విషయాలపై ఆరా తీసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పెట్రోల్ పంపుల్లోనూ అవసరమైన మేరకు డీజిల్, పెట్రోల్ నిల్వలు ఉన్నాయన్నారు. ఈ విషయంలో వాహనదారులు ఆందోళనకు గురికావద్దన్నారు. పెట్రోల్ పంపు యజమానులు ఎప్పటికప్పుడు తమకు అవసరమైన మేరకు డీజిల్, పెట్రోల్ స్టాక్‌ను ఆయిల్ సంస్థల నుండి తెప్పించుకోవాలని సూచించారు. జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనివాసరెడ్డి ఆయన వెంట ఉన్నారు. .



## పదిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ





**ప్రజాపక్షం/చర్లపల్లి:** పదవ తరగతిలో నాగారం స్కూల్ విద్యార్థులు 30 సంవత్సరాలలో కీసర మండలంలో ఉత్తమ ప్రతిభను కనబర్చారని మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.ఎస్ఎస్‌సి ఫలితాల్లో కీరస మండలంలోనే మొదటి స్థానంలో ప్రణీత్ 569,రెండం స్థానంలో నిహారిక 559 మార్కులు సాధించిన నాగారం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఘనత సాధించారు.ఉపాధ్యాయుల కొరత కారణంగా ప్రతి నెల చంద్రారెడ్డి ఔదార్యం చూయించి ఇద్దరు వాలీంటర్లకు 10 వేల చొప్పున చెల్లిస్తున్నారని వారికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాములు,ఉపాధ్యాయులు ,నక్క కిషోర్ గౌడ్,రాజుగౌడ్,కిషోర్‌చారి,రవీందర్‌రెడ్డి,రాకేష్‌గౌడ్,రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

## '99 రోజుల ప్రజాపాలన'లో పట్టణ స్థాయిలో సభ ఏర్పాటు

అధికారులకు కలెక్టర్ దీపక్‌తివారీ ఆదేశం





**ప్రజాపక్షం/వికారాబాద్:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల భాగంగా మున్సిపల్ పరిధిలో పట్టణ స్థాయిలో సభలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫిరెన్స్‌లో అన్ని మండల ఎంపిడిఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ పరిదిలో ఉన్న సమస్యలను గుర్తించి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారులను నియమించాలనీ , మున్సిపల్ అధికారులు సమన్వయంలో పనిచేసి ప్రోగ్రాంను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఇందులో ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లు రైతు భరోసా, మహాలక్ష్మి, జీవితబీమా పథకం కల్యాణ లక్ష్మి షాదీముబరక్ వంటి పథకాలను ప్రజలకు అందుతున్నాయని తెలుసుకోవాలని ఆదేశించా రు.

**పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశం:** ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ ఇండ్ల పురోగతిపై 99 రోజుల పాటు నిర్వహించే ప్రజాపాలనలో హౌసింగ్, సిసి రోడ్లు ,ఎస్ఎస్‌జీ , బిల్డింగ్, స్కూల్స్ కౌంపౌండ్ వాల్స్ అంగన్వాడి ,పిఎచ్‌సి ,గోదంల నిర్మాణంపై అధికారులతో సమిక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి మండలానికి ఇచ్చిన లక్ష్యలను పూర్తి చేయాలని ఆదేశించారు.

**ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి :** వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ నింబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ దీపక్‌తివారీ అధికారులను అదేశించారు. కలెక్టర్ మాట్లాడూతూ రైతులు ధాన్యాన్ని తీసుకు వచ్చే సమయంలో నిబంధనల ప్రకారం మట్టి గుడ్డల తప్ప,తేమ ఇతర నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ,రైతుల సౌకర్యార్థం త్రాగు నీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి కసరు ఇతర సదుపాయలు కల్పించాలనిఅదేశించారు. రైతులు నాణ్యతప్రమాణాలకు లోబడి ధాన్యా న్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు.

**కార్మికదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి:** మే 1వ తేదీన కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక సందర్భంగా జిల్లా కార్మిక శాఖ అధ్వర్యంలో మే1 ఉదయం 10గంటలకు అధికారులు ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.వివిధ కార్యక్రమాలను ప్రజలు కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, డిఆర్‌డిఓశ్రీనివాస్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నా రు.

## నేపాల్‌లో రోడ్డు ప్రమాదం
## 17 మంది హిందూ యాత్రికులు మృతి

**కాఠ్మండు:** నేపాల్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 17 మంది హిందూ యాత్రికులు మరణించారు. థవాంగ్ రూరల్ మున్సిపాలిటీ రోల్పాలో ఈ ప్రమాద ఘటన జరిగింది. పోలీస్ ఇన్‌స్పెక్టర్ సునీల్ థాపా నేపాలీ చెప్పిన సమాచారం ప్రకారం, ప్రమాదం కారణంగా హిందూ యాత్రికులు ప్రయాణం చేస్తున్న జీపు 800 మీటర్ల లోతున పెద్ద గోతిలో పడిపోయింది.జల్‌జలాలో ఉన్న ఒక ప్రముఖ హిందూ దేవాలయాన్ని సందర్శించేందుకు రుకుంకోట్ నుండి యాత్రికులు వెళుతుండగా రోల్పా వద్ద ఈ దుర్ఘటన జరిగింది.

రుకుంకోట్ జిల్లా ప్రధానాధికారి గంగాబహదూర్ ఛత్రి మాట్లాడుతూ, ఈ ఘటన జరిగిన వెంటనే స్థానిక ప్రజలు,పోలీసులు వెళ్ళి వారిని వెలికితీసి ఆసుపత్రులకు తరలించారని చెప్పారు. మే ఒకటో తేదీన వైశాఖపౌర్ణమి సందర్భంగా జల్‌జలాలోని హిందూ ఆలయంలో పూజలు చేసేందుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.



## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రజాపక్షం /వికారాబాద్ రూరల్ :** వికారాబాద్ మండల పరిధిలోని బురంతపల్లి గ్రామ పంచాయతీలోని కొనింటి అనుసుజ, కావలి అండల ,సర్పంచు రాందాస్‌నాయక్ కలిసి స్పీకర్ ప్రసాద్ కుమార్ ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. అనంతరం ధారుర్ మండల పరిదిలోని గురుదోట్ల , కుక్కింద గ్రామల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభోత్సవం చేసి లబ్దిదాలరులో గృహ ప్రవేశలు చేయించారు. ఇళ్ల యజమానులకు శుభాకంక్షలు తెలపి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివా స్ ముదిరాజు, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, అధికారులు పాల్గొ న్నారు.



## మంచినీటి సమస్యను పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌కు వినతి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం, నాగారం, ఘట్‌కేసర్, ఎదులాబాద్‌లోని నివసిస్తున్న ప్రజలకు మంచినీటీ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది ఈసమస్యపై అన్ని పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్, పోచారం మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్, వేముల సంజీవ గౌడ్, పన్నాల కొండల్ రెడ్డిలు గురువారం ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. జోనల్ కమిషనర్‌తో పాటు ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డికి ఇలాంటి కీలక సమయంలో ప్రస్తుతం విధుల్లో ఉన్న వాటర్ మెన్లను బదిలీ చేయడం కొత్త వారితో మంచినీటి సరఫరా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు.వాటర్ మెన్ల బదిలీ ఉత్తర్వులను రద్దు చేయాలని లేకుంటే ప్రజలకు మరింత ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలోమాజీ కౌన్సిలర్ బేతాల నర్సింగ్ రావు,మేకల నర్సింగ్ రావు,బురుగు చంద్రశేఖర్ గుప్తా, శ్రీరాములు, రవీందర్, మేదరి సురేష్ కుమార్డ్, తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీ కొన్న కారు : వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/వికారాబాద్:** మున్సిపల్ పరిధిలోని కొత్తగడి దగ్గర రాత్రి 12గంటలకు ఇన్నోవా వెహికల్ నెంబర్ 28.ఆర్1000 గల కారు హైదరాబాద్ నుండి వికారాబాద్ కి వస్తుండగా వికారాబాద్ కు వస్తున్నడగా వివైడర్‌ను బలంగా గుద్దడంతో అందులో ప్రయణిస్తున్నటువంటినలుగురు వ్యక్తులు కలిమోద్దీన్ , అక్బరుద్దీన్, నాసిర్‌హుషన్, కలిమోద్దిన్‌కి చెస్ట్‌దగ్గర బలమైన దెబ్బలు తగలడం తో ఆసుపత్రికి తరలించడం జరిగింది. మార్గమధ్యలో మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. నిర్లక్ష్యంగా నడిపిన కలిమోద్దీన్ మృతికి కారణమైన వ్యక్తిపైన కేసునమోదు చేసుకోని దర్యాప్తు చేయడం జరుగుతుందని సిఐ రఘుకుమార్ తెలిపారు. ఇట్టి ప్రమాద స్థలాన్ని అర్అండ్‌బి ఇఇ,మున్సిపల్ కమిషనర్ లతో కలసి ప్రమాదకారణాలు అధ్యయనం చేసి అక్కడ మళ్లీ ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకుంటామన్నారు.



## కేంద్ర గ్రంథాలయం ప్రారంభం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవటం ద్వారా తమ లక్ష్యాలను చేరుకోవటంతో పాటు చరిత్ర, ప్రస్తుత సమాజ మార్పులు, అభివృద్ధి పట్ల సమగ్ర అవగాహన ఏర్పడుతుందని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. గురువారం ఆయన జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఎం నాగవేణితో కల్సి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ పరిసరాలను పచ్చ దనంతో నింపేలా చూడటంతో పాటు చదువరుల కోసం నాలుగు కూలర్లను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రంథాలయ అభివృద్ధి కోసం తాను ఇక నుండి స్వయంగా పర్యవేక్షిస్తూ సహకరిస్తానన్నారు.

# దర్జాగా బైన్(పెద్ద) చెరువు కబ్జా!

- ✻ తేల్చేసిన మండల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు.
- ✻ ఎఫ్‌టిఎల్ లో ఇరవై, బఫర్ జోన్‌లో అరవై నిర్మాణాల గుర్తింపు
- ✻ ఐదున్నర ఎకరాల చెరువు స్థలంలో నిర్మాణాలు
- ✻ రేపో, మాపో చర్యలకు సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** బాచుపల్లి బైన్ (పెద్ద) చెరువు బాజాప్తగా కబ్జాకు గురైంది. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో పదుల సంఖ్యలో పక్కా భవనాలు, తాత్కాలిక గుడిసెలు ఉన్నట్లు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తేల్చేశారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లి మండలంలోని బాచుపల్లి గ్రామం పెద్ద (బైన్) చెరువు సర్వేనంబరు 64లో 42.28 ఎకరాలు ఉండగా సర్వేనంబరు 7 లోని పట్టా భూమిలో 5.28 ఎకరాల స్థలంలో చెరువు విస్తరించి ఉంది. పూర్వం నుండి ఈ చెరువుని గ్రామస్థులు అన్ని రకాలుగా వాడుకునే వారని స్థానికులు చెబుతున్నారు.

మత్స్యకారులు చేపలను సైతం పెంచుతూ వారి కుటుంబాల జీవనోపాధికి ఆధారంగా ఈ బైన్ చెరువు ఉపయోగపడుతుంది. రోజురోజుకి బైన్ చెరువు కుచించుకుపోవడం ప్రారంభమైంది. ఈ చెరువు చుట్టూ విల్లాలు, అపార్ట్‌మెంట్‌లు, కాలనీలు ఏర్పడడంతో చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో సైతం నిర్మాణాలు వెలుస్తున్నాయి. చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలోనే కాకుండా బఫర్ జోన్‌ని వదిలేసి ముప్పై మీటర్ల వరకు స్థలాన్ని వదిలేయాలి. అట్టి స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు.



కాగా 2020 సంవత్సరంలోనే ఐదంతస్థుల భవనాలు వెలిశాయని ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. బైన్ చెరువు ఎఫ్‌టిఎల్‌లో 1.30 ఎకరాల్లో దాదాపు ఇరవై పక్కా భవనాలు, యాభై తాత్కాలిక గుడిసెలు ఉన్నాయని, చెరువు బఫర్ జోన్ 3.35 ఎకరాల్లో సుమారు అరవై నిర్మాణాలు వెలిశాయని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. బైన్ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో వెలసిన భవనాలకు, షెడ్లకు నిజాంపేట్ సర్కిల్ అధికారులు అనుమతులను రద్దుచేయాలని రెవెన్యూ అధికారులు నివేదికను పంపారు. బాచుపల్లిలోని పెద్ద (బైన్) చెరువు రోజురోజుకి కబ్జాకు గురవుతుండడంతో రెవె న్యూ, ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే ఆక్రమణలను గుర్తించి జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓలకు నివేదించారు. ఆక్రమణలను ఇలాగే వదిలేస్తే రాబోవు రోజుల్లో చెరువు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం నెలకొంది. ఇప్పటికే చెరువుపై ఆధార పడి చేపలను పెంచుకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారే అవకాశాలు లేకపోలేదు. అంతేకాకుండా బాచుపల్లి చెరువు కనుమరుగైతే భూ గర్భ జలాలకు సైతం ముంపు వాటిల్లే ప్రమాదం నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాచుపల్లి బైన్ చెరువు ఆక్రమణలను తొలగించి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**బైన్ చెరువు కబ్జాలపై ఉన్నతాధికారులకు నివేదించాం, చర్యలు తీసుకుంటాం: బాచుపల్లి మండల తహసీల్దార్ వాణిరెడ్డి**

బాచుపల్లి బైన్ చెరువు ఆక్రమణల పై ఉన్నతాధికారులకు నివేదించామని చర్య లు తప్పనిసరిగా తీసుకుంటామని బాచుపల్లి మండల తహశీల్దార్ వాణిరెడ్డి తెలిపారు. బాచుపల్లి బైన్ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలు పదుల సంఖ్యలో ఉన్నాయని, ఇరిగేషన్, రెవెన్యూ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో నిర్మాణాలను గుర్తించామని, నిజాంపేట్ సర్కిల్ అధికారులు నిర్మాణాలకు జారీ చేసిన అనుమతులను సైతం రద్దు చేయాలని చెపినట్లు వాణిరెడ్డి వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెరువు ఆక్రమణలపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

